# ఉద్యమం సరళ రేఖ కాదు

మాణిక్యానికి పెళ్లయి వెళ్లిపోయింది. మాణిక్యం తల్లి బాలమ్మ మరొక పని మనిషిని తీసుకొచ్చి అప్పగించింది. కొత్తామె పేరు కామక్షమ్మ. సుమారు ముప్ఫయి సంవత్సరాలుండొచ్చు. బక్క పల్చగా చామనచాయగా వుంటుంది. మా కోలనీకి ఆమె వుండే యిల్లు కాస్త దూరమే అయినా చీకట్నే లేచి వస్తానని చెప్పింది. ఇల్లంతా చూసింది. చెయ్యవలసిన పనులు, రావలసిన వేళలూ అన్నీ చెప్పాను. అంతా విని మరొక ఇరవయి పెంచడమ్మా అన్నది. చూద్దాంలే ముందు పని కానీ అన్నాను. పనులన్నీ బాగానే చేస్తున్నది. నెమ్మదయిన మనిషే. వచ్చిన మర్నాడు -

"యేటీ అనుకోకపోతే తమర్నోమాట అడగమన్నారా" అన్నది. అడగమన్నాను.

"తమరు ఇజీనగరంలో పాతబస్టాండు కాడ ఆశపు ఈదిలో రామ్మందిరం ఎదురుగా ఎత్తరుగుల యింట్లో వుండేవోరు కదమ్మా" అన్నది.

"నిజమే. నీకెలా తెలుసు"

"మేమా ఆ దగ్గర్లోనే నాగాశపు ఈదిలో వుండే వాళ్లం. మా యమ్మ మీ యింటికి నీళ్ల మోతకీ, ఒంటపనికీ వచ్చేది కదమ్మా"

"గోవిందమ్మా - గోవిందమ్మేనా ? గుర్తొచ్చింది"

"ఆ ఔనమ్మా, నేనా గోవిందమ్మా కూతుర్నేనమ్మా"

"నువ్వు గుర్తు లేదుగానీ, మీ అమ్మ గోవిందమ్మ గుర్తే. పిండివంటలు బాగా చేసేది. మా యింట్లో జరిగిన నాలుగు పెళ్లిళ్లకీ మీ అమ్మే వంటలు చేసింది-"

"ఔనండమ్మా. అప్పుణ్ణేను ఆశపు ఈది బళ్లో ఐదు సదివీ దాన్ని-"

"నువ్వు చదువు కున్నావు కూడానా. ఎంతవరకూ చదివేవూ ?"

"ఐదు పేసయ్యానండీ. కట్ల పాము కరిసేసి మా నాన్న సచ్చిపోయేడు. నన్ను సదువు మానిపించీశారు. పెద్ద మణిసయిన సంవత్సరం తిరక్కుడానే పెళ్లి చేయిస్సేరు -"

"మరి ఈ వూరెలా వచ్చేవు-"

"అదంతా పెద్ద స్టోరీ లెండమ్మా. మజ్జానం వచ్చినపుడు సెపుతాను"

ఆయనకి ఆఫీసుకు వేళయిపోతుంది. కారియరు సర్దాలి. పిల్లల్ని తయారు చేసిస్కూలు పంపాలి. గోవిందమ్మ రూపాయి కాసంత బొట్టుకునీది. ఇద్దరన్నయ్యల పెళ్లికీ, అక్క పెళ్లికీ నాపెళ్లికీ తనే వంటలు చేసింది. మాయింట్లో నుయ్యి తప్ప కుళాయి లేదు. చుట్టాలు పక్కాలు వచ్చినప్పుడు కుళాయి నీళ్లు మోసేది.

రెండు గంటలయింది. భోజనంచేసి వంటగది చక్కబెట్టి పేపరు తిరిగేస్తూ కునుకుతీసి లేచాను. పోస్టుమన్ ఉత్తరాలిచ్చి వెళ్లేడు. గుంటూరునుంచి ఒక వుత్తరం, ఎకనమిక్ అండ్ పొలిటకల్ వీక్లీ పత్రికా వచ్చాయి. నాన్నగారికీ మధ్య సుస్తే చేసి తగ్గిందట. పడమటి పక్క వాటా రెండు నెలలయి ఖాళీగానే వుంటుందట. మనసంతా ఎలాగో అయిపోయింది. నాన్నగారికి ఎనభయి దాటాయి. ఒకసారి వెళ్లి చూసొస్తే బాగుణ్ణు. అమ్మ మరీ లొంగిపోయింది.

వీధిలోకి సీతాఫలాలొస్తే బేరం చేసి కొంటున్నాను. కామాక్షమ్మ వచ్చింది. మూడయింది.

సెప్టెంబరు నెల. వినాయక చవితి వెళ్లి వారం రోజులయింది. వాతావరణం ఆహ్లాదంగానే వుంది. గిన్నెలు తోమి, డాబా మీదికి వెళ్లి ఉదయం ఉతికి ఆరేసిన బట్టలు తెచ్చి, ఇళ్లూ వాకిళ్లూ చక్కబెట్టి తుడిచి, మొక్కలికి నీళ్లు పోసింది.

"మా ఆయనకి సుస్తీగా వుంది. ఒక పాతిక రూపాయలుంటే యివ్వండమ్మా జీతంలో పట్టుకుందురుగాని-"

కామాక్షమ్మ మొగుడు - కొత్తగ్రహారం సిటీ ఎంపోరియంలో గుమాస్తా పనిచేసేవాడు. ఆ సమయంలోనే కామాక్షమ్మ పక్క వాటాలో వున్న చయనులు కొడుకు కామాక్షమ్మ మీద కన్ను వేశాడు. చేపలబుట్ట చూసిన పిల్లిలాగ తెగతిరిగేవాడు. అప్పటికి కామాక్షమ్మకి పద్దెనిమిదేళ్లు. తొలు సూలు మగపిల్లడు పుట్టి పురిటి మయిలు తీరకుండానే చచ్చిపోయేడు. మళ్లీ నీళ్లు పోసుకోలేదు. ఒకరోజు పెరట్లో నీళ్లు తోడుకుంటూవుంటే, చయనలుకొడుకు శంకరం గోడదూకి పిల్లిపిల్లలా చప్పుడు చెయ్యకుండా వెనకనుంచి వచ్చి కామాక్షమ్మ కళ్లు మూశాడు. మునిమాపు వేళ కామాక్షమ్మకి గుండెలు దడదడలాడాయి. ఎదమీద వున్న కోడిగిత్తలా వున్నాడు. వొళ్లంతా ముద్దులు పెట్టి ఏమోమో చేశాడు. భయం భయం భయం తప్ప కామాక్షమ్మకి ఏమీ తెలీదు. కాళ్లు వణుకుతుంటే కోక సర్దుకుంటూ ఇంట్లోకొచ్చి పడింది. ఇల్లంతా చీకటిగా వుంది. వొళ్లంతా అసహ్యంగా వుంది. ఛీఛీ అనిపించింది. అయ్యో అయ్యో అనుకుంది. నలుగురికీ తెలిస్తే ఇంకేమన్నా వుందా అమ్మో అనుకుంది. తలమీంచి స్నానం చేసేద్దా మనుకుంది. మళ్లీ నూతి దగ్గిరకెళ్తే అతనొస్తాడేమో - వద్దు వద్దు - అనుకుంది. బట్టలు విప్పేసి, ఉతకిన బట్టలు కట్టుకుంది. కాళ్లూ చేతులూ ముఖం పామిపామి కడుక్కుంది. తాను అపవిత్రం అయిపోయేననుకుంది. ఆ రాత్రి మొగుడు దగ్గిరికి తీసుకుంటే కుంచించుకు పోయింది. మనసంతా గందరగోళంగా వుంది. ఒంటరిగా పెరట్లోకి వెళ్లడం మానేసింది. ఈలోగా శంకరం తనపనితను మానలేదు. ఓ రోజు ఈలవేశాడు. మరోరోజు రాయివిసిరేడు. రక్తం రుచిమరిగిన పులి.

ఒకసారి మా పుట్టింటికి వెళ్లొస్తానంది. సంక్రమణం వచ్చేనెలలోనే కదా - అప్పుడు వెళ్దువుగానిలే అన్నాడు. సరేననుకుంది. ఫరవాలేదులే అనుకుంది. ఒక రోజు మళ్లీ అలాగే జరిగింది. పట్టపగలే జరిగింది. మెట్టమధ్యాహ్నం. నారింజచెట్టు మూలకి లాగేడు. నోరు పెగల్లేదు. కరచరణాలాడలేదు. ఏదో మాయ కమ్మినట్టుయి పోయింది. ఇరకయి రూపాయల కాయితం రవికలో దోపాడు.

సంక్రాంతికి విజయనగరం వెళ్లింది. వచ్చింది.

మళ్లీ..... మళ్లీ.... ఈ సారి యాభయి .... ఈ సారి వంద. మా అమ్మ చీర కొనుక్కోమని ఇచ్చిందని బొంకింది మొగిడితో. ఏదో మంత్రం వేసినట్టు లొంగిపోతుంది. కనికట్టు వేసినట్టు కట్టుబడిపోతుంది. ఇదే ప్రేమంటే అన్నాడు. నువ్వే నా రాణి అన్నాడు. భయపడనంతా జరిగింది. నెల తప్పింది. ఇప్పుడేం ధారి ? ఈసారి రావద్దని చెప్పేస్తాను. ఇక నన్ను మర్చిపోమని చెప్పేస్తాననుకుంది.

అంతా కల. కలలో జరిగినట్టే వుంది. అత్తగారు గుచ్చి గుచ్చి అడిగింది. నెల తప్పిందని చెప్పింది. ఈ సారి కొంచెం ఆలస్యం అయివుంటుందనేసింది. మొగుడికి తెలియదు. ఇదంతా పాపం కాదూ - పాపం పాపమే. నరకానికి పోతుందితను. దేవుడిలాటి భర్తని మోసం చేసింది. తనకేం లోటు ?

తనకి నిష్కృతి వేరు.

చివరికి ఇద్దరూ కలిసి బెజవాడ రైలెక్కేరు. మానస లాడ్జి. వారం రోజులు పగలు రాత్రి తెలియలేదు. ఒక పక్క స్వర్గ సౌఖ్యాలనుభవిస్తున్నా కూడా, ఒక నేర భావం వెంటాడుతూనే వుండేది.

ఒక రోజు మేనత్తే ఒక పాత సినిమా గుణ సుందరికథ వస్తే ఇరుగు పొరుగుల్తో కలిసి వెళ్లింది. అత్తకూడా పెద్ద కూతురు వెళ్లింది. మిగిలిన ఇద్దరు చిన్న పిల్లలు ఒకరికి నాలుగు, ఒకరికి రెండు. ఆ సమయం చూసి మామయ్య కామాక్షి చెయ్యపట్టుకున్నాడు. నీకు దణ్ణం పెడతాను నన్ను వదిలెయ్ మామయ్యా అన్నది. వినిపించుకోలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. ఎలాగన్నా తప్పించుకోవాలి. కిరసనాయిలు సీసా చేసి తలమీద బాదింది. సీసా పగిలి తలమీద గాయమైనది. వంటినిండా కిరసనాయిలు. ఇంతలో ఇరుగుపొరుగు చేరారు. మరికాస్సేపట్లో మేనత్తే వచ్చింది. సంగతి తెలుసుకొని మొగుణ్ణి తిట్టరాని తిట్లన్నీ తిట్టింది. ఆ రోజునుంచీ ఇల్లుకదలకుండా కామాక్షమ్మని కంటికి రెప్పలా కాపాడింది.

పగటివేళ. రైల్వేప్లాటుఫారం మీద వేరుశనక్కాయలమ్ముతున్నది. రోజా ఆయిదో పనీ మిగిలేది. ఆడబ్బులు తెచ్చి మేనత్తచేతికే ఇస్తుంది. ఆ క్షణం నుంచీ మేమామతో మాట్లాడితే వట్టు.

ఒక రోజు తెల్లవారి లేచేసిరికి రూంలో శంకరంలేడు. తన వంటిమీదవున్న నగలూ లేవు. చెవి రింగులు రాలేదు గనక వదిలేశాడు. బంగారపు కొట్టుకు వెళ్లి రింగులు కత్తిరించి అమ్మేసి, లాడ్జికి వెళ్లి రూం అద్దెకట్టి రైలెక్కి అనకాపల్లిలో దిగింది. అక్కడ రమేష్ మామయ్య రైలు కట్ట పక్క ఒక చిన్న అద్దెయింట్లో వుంటున్నాడు. అతను తనకి తెలిసినపుడు ఒక ప్రెస్‌లో కంపోజిటరుగా పనిచేసేవాడు. ఇప్పుడు రైల్వేస్టేషన్‌లో పేపర్లు పత్రికలు అమ్ముకుంటున్నాడు. పూటబత్తెం, పుల్ల వెలుగు. చావకుండా బతక్కుండా సంసారం ఈడుస్తున్నాడు. ముగ్గురు పిల్లలు. తనని పోషించలేడు. పైగా తను మామూలు మనిషికాదు. దిక్కుతోచలేదు. జీవితం మీద విరక్తి కలిగింది. ఉరిపోసుకుని చద్దాం అనుకుంది. వేవిళ్లు - వాంతులు..... చెవిరింగులు అమ్మగా మిగిలిన డబ్బులు హారతికర్పూరంలా ఖర్చయిపోయి. మామయ్య తిట్టాడు. పద మీ యింటిదగ్గర దిగబెడతానన్నాడు. మీ నాన్నతోనూ, మీ ఆయన తోనూ మాట్లాడతాను పదమన్నాడు. వద్దంది. తానింక ఆయింటి గడప తొక్క దలుచు కోలేదు. గౌరవంగా బ్రతుకుతున్న వాళ్ల కుటుంబంలో కలతలు సృష్టించదలుకోలేదు.

ఆ సమయంలోనే రాజారావుతో పరిచయమైంది. తనని రాజారావు ఆదుకుని వుండకపోతే తన బ్రతుకు ఏమయ్యేది ? తలుచుకోవడానికే భయంగా వుంది. రాజారావు రైల్వేకళాసీ. ముసలి తల్లీ తండ్రీ. పెళ్లి కావలసిన ఇద్దరు చెల్లెళ్లు. ఆ సమయంలో నెలలు నిండిన తనని చేరదీశాడు. తనూ రుణం వుంచుకోలేదు. ఆ యింటికింద చెయ్యరాని చాకిరీ చేసింది. అతనిది ఏ కులమో తెలీదు. తరవాత తెలిసింది పెద్దకాలం అని సంప్రదాయంలో పుట్టి పెరిగింది గనుక మనసు పరిపరివిధాల కొట్టుకుంది. కాని ఏం చెయ్యగలదు ? చేరదీసి ఆదుకున్న మనిషిని వదులుకుంటుందా . శరీర సంబంధం కూడా ఏర్పడిది. ఇప్పుడిక వెనకడుగు వెయ్యలేదు. అప్పుచేసి యిద్దరు చెల్లెళ్లకీ పెళ్లి చేశాడు రాజారావు. మొదటికాన్పు మొగపిల్లడే. పాపఫలితం ఏపాపం విరగని పసివాణ్ణి అలా చూడ్డంతప్పు. తను తప్పుచేసింది. కళ్లు మూసుకుపోయి తప్పు చేసింది. వాడు, శంకరం పోలిక కాదు. తనపోలికే. బంగార్రాజు అని పేరు పెట్టుకుంది. రాజారావే ఆపరేషను చేయించుకున్నాడు. ఆపరేషను చేయించుకున్న కొత్తలో ఒక రాత్రి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోంచి లగేజీ దించుతుంటే, కాలుజారిపడిపోయాడు. ప్లాటుఫారానికే, బండికీ సందులో పట్టా

మీద పడిపోయేడు. చచ్చిపోయేడనే అనుకున్నారు. కుడిచెయ్యి విరిగింది. తగ్గలేదు. జెబ్బవరకు చెయ్యతీసెయ్య వలసివచ్చింది. ఇదంతా జరిగి ఏడాదయ్యింది. పెద్దవాడికి - శంకరం కొడుక్కి - పదేళ్లు వచ్చాయి. మామయ్యతోపాటు ప్లాటుఫారం మీద పేపర్లమ్ముతాడు. వాడు తల్లితో అయిదో తరగతి వరకూ చదివి మానేశాడు. వాడికి చదువు మీద కంటే పనిమీద దృష్టి ఎక్కువ. నీళ్లు తోడతాడు. తల్లికి వంటిసాయం చేస్తాడు. బట్టలుతుకుతాడు. చిన్న చేతుల్తో వాడు చాలా పన్లు చేస్తాడు. మరొక్క ఏడాది పోతే, నెహ్రూ చౌక్‌లో వాడిచేత సైకిలు షాపు పెట్టిస్తానంటుంటాడు రాజారావు. వాణ్ణి చదివించాలనుంది కామాక్షికి.

ఈ పదేళ్ల కథ కళ్లల్లో మెదిలింది కామాక్షికి. ముప్పయేళ్లు నిండకుండానే చాలా జీవితం చూసింది. ఎక్కడో పుట్టింది. ఇక్కడ తేలింది. రెక్కాడితేగాని డొక్కాడని బతుకు బతుకుతుంది.

నిట్టూరుస్తూ లేచి నిలబడింది.

"అదిగోనమ్మా పిల్లలు బడినుంచి వచ్చారు. అయిదయి పోయినట్టుంది" గబగబా వీధివాకిలి తుడిచి, నీళ్లు జల్లి సుద్దముక్కతో నాలుగు గీతలు గీసి ముగ్గులు పెట్టింది. వచ్చి వంటగదివార నిలబడింది. కాసేపు ఆగి - " ఎళ్లొస్తానండమ్మగారూ-" అంది. అప్పుడు గుర్తొచ్చింది. పాత కరూపాయలు పట్టుకొచ్చి ఇచ్చాను. "ఇంతకుముందు ఏమన్నా వాడుకున్నావా" అనడిగేను. లేదన్నది.

★ ★ ★

నాలో మళ్లీ ఆలోచనలు చెలరేగాయి. పిల్లలు డాబా మీద చదువుకుంటున్నారు.

ఆయనింకా రాలేదు. పిల్లల భోజనాలయ్యాయి. నేనింకా తినలేదు. ఎందుకో ఆకలికావడంలేదు. టీవీ ముందుకూచున్నాను. కళ్లు చూస్తున్న దృశ్యన్ని మనసు గ్రహిస్తున్నట్టు లేదు.

స్త్రీ పురుషుల సంబంధాన్ని నిర్ణయించే అంశాలేవి ? ప్రేమ ఆర్థిక సంబంధాలా ?కుటుంబమా ? ప్రేమ నిజమా కామం నిజమా? అనే ప్రశ్న ఇప్పుడు నేను వేసుకోను. కామం అనే శారీరక లక్షణం యొక్క బాహ్యరూపమే ప్రేమ. ఆకలి వేసినపుడు తినాలనిపిస్తుంది. కామం అటువంటిదే. దీనికి అందమైన ఉపరితల రూపం ప్రేమ.

కామాక్షి అందంగా వుంటుంది. పొడవుగా పుష్టిగా వుంటుంది. ముప్పయి ఏళ్ల వయసులో ముగ్గురు బిడ్డల తల్లి అయినా ఇంకా మగవాడి కన్ను చెదరగొట్టగలదు,మంచిబట్టలు కట్టుకుని ముస్తాబయితే. మాసిన బట్టల్లో మబ్బుల్లో దాగున్న చంద్రుడిలా వుంటుంది. ఆమె మగవాడి స్వార్థానికి బలయింది. కాని ధైర్యంగానే నిలదొక్కుకుంది. బెజవాడ లాడ్జిలో చయనులు కొడుకు, శరీరాన్నే కాక వంటిమీద బంగారాన్ని కూడా దోచుకుని పోయినపుడు - ఆదరించాడనుకున్న రమేష్ మామయ్య అత్యాచారానికి పాల్పడినపుడు ధైర్యంగానే నిలబడింది. రాజారావుమీద ఆమెకి ఇష్టం వుందా ? లేదా?

చయనులు కొడుకుమీద ఒక ఆకర్షణ, ఒక మోజు వుంది. అది ఆమెని ఈ స్థితికి తీసుకొచ్చింది.

సరళ కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీయస్ నాలుగో సంవత్సరం చదువుతుంది. గతసారి సెలవల్లో వచ్చినపుడు ఫైనలియరు అబ్బాయిని ప్రేమిస్తున్నానని చెప్పింది. అనంతపురంలో ఒక పెద్ద పారిశ్రామికవేత్త కొడుకట. కోటీశ్వరుడట. రోజూ కారులో వస్తాడట. ఆ అబ్బాయికి పెళ్లి విషయంలో పూర్తి స్వాతంత్ర్యం వుందట. హౌస్ సర్జన్ చేశాక పెళ్లి చేసుకుంటానన్నాడట. ఇద్దరూ కలిసి స్టేట్స్ వెళిపోదాం - అన్నాడట. సరళ ఇరవైయేళ్లపిల్ల లోకం ఏం తెలుసు ? పంచరంగుల కలలు కంటుంది. జీవితం ప్రేమ సినీమాలోలాగ వుంటుందనుకుంటున్నది.

మగపిల్లాడు కావలసింది సరళ. చాలా పట్టుదల మనిషి పిచ్చికోపం దానికి. కాలేజీలో పరుగుల రాణి. చండీఘర్ వెళ్లి బాడ్మింటన్‌లో షీల్డు గెలుచుకొచ్చింది. మంచిపిల్ల చదువులోనూ ఫస్టే మా అత్తగారు ఆనవాయితీ ప్రకారం ఈసారి మగపిల్లాడే పుడతాడని చెప్పారు. వాళ్ల కుటుంబంలో నాలుగు తరాలుగా, తొలిచూలు మగపిల్లాడేనట.. స్కానింగ్‌లో కూడా మగపిల్లాడేనని చెప్పాడు. ఎదురుకాళ్లని ఆడపిల్ల పుట్టింది.

జన్మనక్షత్రం మంచిదికాదు, శాంతి చెయ్యాలన్నారు. ఆయనకిటువంటి నమ్మకాలేం లేవు. తరవాత ఇద్దరూ ఆడపిల్లలే. చాలాచాలు ఇక ఆపరేషన్ చేయించేసుకుంటానన్నారాయన. మా అత్తగారు శతపోరుపెట్టి ఆపారు కడసారం మగపిల్లాడు. వాడికిప్పుడు పదేళ్లు. నేను పురిటిస్నానం అన్నా చెయ్యకుండా ఆయన ఆపరేషన్ చేయించేసుకున్నారు. ఆడపిల్లేమిటి ? మగపిల్లేమిటి ? మేం ఇద్దరం మాకిద్దరు అనుకుంటున్న ఈ రోజుల్లో నేను నలుగురు బిడ్డల్ని కన్నాను.... బయట బండి చప్పుడయింది. వచ్చారుగావును. పిల్లలు మేడ దిగారు. తొమ్మిదయింది. లేచి టీవీ కట్టేశాను.

★ ★ ★

రోజులు పరస్పర ప్రతిధ్వనుల్లా గడుస్తున్నాయి. ఇంటి వెనక మామిడి చెట్టు పూతపూసింది. పెరట్లో మల్లిచెట్టు మొగ్గ తొడిగింది. వసంతకాలం వెయ్యి అందాల్తో విచ్చేసింది. సరళ ఉత్తరం రాసింది. చదువుతున్నాను. మరొక రెండు వారాల్లో వస్తుందట. కోటిరెడ్డి ఫైనలియర్ పరీక్షలు రాశాడట. స్టేట్స్‌లో వున్న వాళ్లక్క దగ్గరికి వెళ్లి రెండునెలలుండి వస్తాడట. అయిదులక్షల కట్నం, కారుతో ఒక సంబంధం వస్తే చేసుకోనన్నాడట. వాళ్ల యింట్లో పెద్దగా పట్టుబట్ట లేదట. ఏదోదో రాసుకొచ్చింది.

మాణిక్యం వచ్చింది. నీళ్ల పోసుకుందట. జాకిట్టు గుడ్డ పెట్టి, యాభయిరూపాయలు చేతిలో పెట్టాను. చేటంత ముఖం చేసుకుని నవ్వింది. పిల్ల మొహంలో ఇంకా బాల్యం పోలేదు. మా రెండోపిల్ల సులేఖ వయసు. మాహావుంటే పదిహేను సంత్సరాలుంటాయి పెళ్లయి ఏడాది నిండకుండానే బిడ్డతల్లి కాబోతోంది. ఇంకా మనదేశంలో బాల్య వివాహాలు పూర్తిగా పోలేదు.

ఆయనకి బొంబాయిలో మూడు వారాల ట్రయినింగుందట. అక్కణ్ణించి గోవా కూడా వెళ్లి వస్తారట. అటుయిటూ ప్రయాణం రోజుల్తో కలుపుకుని ఖచ్చితంగా నాలుగు వారాలు తాను బయలుదేరేసరికి సరళరాడు. రాత్రి తొమ్మిది తరవాత కర్నూలు ఫోన్ చేశారు.

"సెమిస్టర్స్ ఉన్నాయి, నాన్నగారూ - లేకపోతే కాలేజీ ఎగ్గొట్టేసి వచ్చేసేదాన్నే-"

"బాగా రాయి బేబీ. గోల్డ్ మెడల్ రావాలి.ఆగస్టు 15 కి యింటి దగ్గరే వుంటాను. ఆల్‌ది బెస్ట్"

"అమ్మని ఫోన్ దగ్గరకి రమ్మనండి"

"అమ్మా ! నేను ఆగస్ట్ రెండో తేదీకల్లా యింటి దగ్గిరుంటాను -"

పిచ్చి సరళ. దేశంకాని దేశంలో హాస్టలు మెతుకులు తింటూవుంటుంది. వచ్చినప్పుడల్లా కందిగుండ, ఆవకాయ, నెయ్యి మోసుకు వెళ్తుంది. సురేఖ, కల్పన, విక్రమ్ లతో కూడా మాట్లాడింది.

ఆయన బొంబాయి వెళ్లిన మూడోనాడే వచ్చేసింది సరళ. ఒక ఫైనలియర్ అమ్మాయిమీద పాతాలజీ ప్రొఫెసర్ అత్యాచారం చేసి హత్యాప్రయత్నం చేసి గాయ పరిచాడట. ఆ అమ్మాయి నలుగురు ఫ్రెండ్స్ సహకారంతో తిన్నగా మర్నాడు పోలీసు స్టేషన్‌కి వెళ్లి రిపోర్టిచ్చిందట. ఆ ప్రొఫెసర్ పరారీలో ఉన్నాడట. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మెడికల్ కాలజీ ల్లోనూ సమ్మెజరుగుతుంది. కాలేజీలూ, హాస్టళ్లూ కూడా మూసేశారు.

"ఈ సెలవులేవో నాలుగు రోజులు మందిచ్చినా బాగుండేది. నాన్నగార్ని చూసేదానివి. ఆయన వచ్చేసరికి మళ్లీ వెళిపోతావుగావును-"

"ఎవరు చెప్పగలరు -"

"ఆ అమ్మాయి మా హాస్టల్లో ఓల్డ్ బ్లాక్‌లో వుంటుంది. నాకు బాగా తెలుసు వాళ్లది ఒంగోలు. పెద్దగా అందంగా వుండదు. ఆ ప్రొఫెసరు వయసు కూడ దాదాపు ఏభయి వుంటాయి. అత్యాచారం చేసింది చాలక, తిరగబడి అందరితో చెబుతుందని భయపడి చంపబోయాడు. ఆ అమ్మాయి దొరకలేదు. ఆసిడ్ సీసా విసిరేశాడు. సీసా తగల్లేదు,కాని పక్కనే వున్న టేబిలు తగిలి పగిలిపోయి వళ్లంతా పడింది. ఆ అమ్మాయికూడా పేపర్ వెయిటు తీసి మొహాన విసిరింది. మొహం పగిలి కుడికన్ను పోయిందట - ప్రొఫసర్ బాగా డబ్బున్నవాడు. మొన్నీమధ్యనే చిన్న కూతురికి అమెరికా కుర్రాడితో పెళ్లి చేశాడట -"

ఎప్పుడొచ్చిందో కామాక్షమ్మ వచ్చి అంతా విన్నది -

"అణ్ణి బతకనివ్వ కూడదమ్మా ఎదవ సచ్చినోడు -" అన్నది.

"ఆ అమ్మాయి తండ్రి పోస్టుమేస్టారట. పెద్దగా వున్నవాడు కాదు. అతనూ వచ్చాడు. సంఘటన జరిగిన మర్నాడు మాతో పాటు కలెక్టరాఫీసుకొచ్చి మెమోరావడం ఇచ్చాడు. పాపం గోడుగొడున ఏడుస్తున్నాడు. ఆ అమ్మాయి ఆస్పత్రిలో వుంది - కాన్‌సంట్రేటెడ్ సల్ఫ్యూరిక్ ఆసిడ్ - కుడి చెంప మీదా, మెడ మీదా చర్మం బాగా కాలిపోయింది -

"ఇక ఆ పిల్ల బతుకు నాశనమయినట్టే - పెళ్లి కావడం కష్టం" అన్నది కామాక్షమ్మ -

ఆ రాత్రికి సరళ బొంబాయి ఫోన్ చేసి తండ్రితో మాట్లాడింది. మర్నాడు స్నేహితుల్ని కలిసి వస్తానని ఊళ్లోకి బయలుదేరింది. మధ్యాహ్నం భోజనానికి రాలేదు. పొద్దుననగా వెళ్లింది. ఇంకా రాలేదంటే కొంచెం కంగారనిపించింది. సాయంత్రం దీపాలు పెట్టేవేళకి వచ్చింది.

"ఏమిటే ఇంత ఆలస్యం ? మధ్యాహ్నం ఎక్కడ భోజనం చేశావు -" అని నేను ప్రశ్నలు వేస్తుంటే వినిపించుకోకుండా, బట్టలు మార్చుకుని స్నానానికి బయలు దేరింది.

"ఏం జరిగింది ? ఎందుకలా వున్నావు ? మాట్లాడవేమిటి ?"

"నీకు జ్యోతి తెలుసా ?"

"జ్యోతి ఎవరూ ?"

"మా క్లాసు మేట్ జ్యోతి తెలియదా ? చాలా ఎర్రగా పొడవుగా వుండేదీ ?"

"గుర్తు లేదు -"

వెళ్లి తాను ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పటి గ్రూప్ ఫొటో తెచ్చింది సరళ. అందరిలోనూ ప్రత్యేకంగా పొడవుగా కనపడుతోంది." ఈ అమ్మాయే జ్యోతి " అన్నది.

"అయితే ఏమిటీ ?"

"చింతపల్లి కొండల్లో చంపేసేరట-"

"చంపేశారా ? చింతపల్లి కొండల్లోనా ?"

"ఎన్ కౌంటర్ - అంటే పోలీసుల హత్య-"

"ఏం - ఎందుకు చంపేశారూ ?"

"బ్రతికితే అలా బ్రతకాలమ్మా ! కామ్రేడ్ జ్యోతి ! ఆమె నాక్లాస్ మేటయినందుకు నేనెంతో గర్విస్తున్నానమ్మా-"

"నేను ఎం.బి.బీయస్.కి వెళిపోయాను - తను డిగ్రీలో జాయనయిన కొద్ది రోజుల్లోనే దళాల్లోకి వెళిపోయిందట. మేం చదువుతున్నప్పుడే రాడికల్ జ్యోతి అనేవారు. ఒకసారి ప్రిన్సిపల్ మేడమ్‌ని ఎలా ఎదిరించింది తెలుసా ? స్కాలర్ షిప్‌లకోసం నలుగురమ్మాయిల్ని ఏడిపిస్తుంటే ప్రిన్సిపల్ మేడమ్‌ని పట్టుకుని కడిగేసింది. మర్నాటికల్లా పైస పుచ్చుకోకుండా స్కాలర్‌షిప్ చెక్కులురాసిచ్చారు. నా కంటే ఒక ఏడాది పెద్దది. టెన్త్‌క్లాస్ తరవాత ఒక సంవత్సరం చదువు మానేసిందట. చాలా తెలివైంది. డిగ్రీలో జాయినయిన కొద్ది రోజుల్లోనే పార్టీలోకి వెళిపోయింది. ఆ తరవాత రెండేళ్ల వరకూ ఇంటికి రాలేదట. ఒకే ఒకసారి ఒక రాత్రి మీద వచ్చి అందర్నీ పేరు పేరునా పలకరించి - చీకటితోటే వెళిపోయిందట. తరవాత మళ్లీ కనిపించలేదు. చింతపల్లి కొండల్లో ఎన్‌కౌంటర్లో చనిపోయిందని తెలిశాక వెళ్లి శవాన్ని చూశారట. పోలీసులే కాల్చేశారట. మొత్తం నలుగురు చచ్చిపోయే నాటికి ఒక ఇరవై రెండేళ్లు కూడా నిండ లేదు, చచ్చిపోతూ ఇద్దరు పోలీసుల్ని గాయపరిచిందట -"

"ఎన్నాళ్లయింది ?-"

"రెండు నెలలవుతుందట -"

"నాకిదేం తెలవదు. ఎన్ కౌంటర్ల గురించి పత్రికల్లో చదవడమే తప్ప, ఆ సంగతులేం తెలియవు నాకు",

"మా హాస్టలుకి అన్ని పేపర్లూ వస్తాయి. నేను దాదాపు రోజూ చదువుతాను. పత్రికల ప్రాంతీయ పేజీలవల్ల - ఏ ప్రాంతం వార్తలు ఆ ప్రాంతంలోనే వుండి పోతున్నాయి. మాకు అక్కడి సంగతులేం తెలియవు -"

భోజనం కూడా సరిగ్గా చెయ్యలేదు.

"ఈ దేశంకోసం ఈ ప్రజలకోసం జ్యోతి చచ్చిపోయిందమ్మా, ప్రాణాలు బలిచ్చింది-" అంటూ చాలా సంగతులు చెప్పుకొచ్చిందిజ్యోతి. అల్లూరి సీతారామరాజులాగా, ఒక భగత్సింగ్‌లాగా ప్రజా శ్రేయస్సుకోసం పాలకవర్గాల చేతిలో మరణించిందట. కాంగ్రెసు పార్టీ అయినా, తెలుగు దేశం పార్టీ అయినా - రెండూ ఒకటేనట - "ఇదంతా నాకు జ్యోతి వాళ్లన్నయ్య భాస్కర్రావు చెప్పాడు. అతన్ని చూస్తుంటే జ్యోతి అతన్న ఆవేశించిట్టని పిస్తుంది. ఆమెని చంపినవాడు తాతా రెడ్డి అని పరమక్రూరుడైన పోలీసు ఆఫీసరట. వాణ్ణి ఎలాగయినా చంపే అవకాశం వస్తే బాగుణ్ణని కలలుకంటున్నాడు. నేనెలాగో పెళ్లి చేసుకోలేదు గనక నేను దళంలో చేసి తుపాకి పట్టుకుంటాను అంటున్నాడు. నాయనా వద్దు కొడుకో అని తల్లీ తండ్రీ గోలపెడుతున్నారు."

సరళ కళ్లు జ్యోతుల్లా వెలిగిపోతున్నాయి.

"వాళ్లన్నయ్యని కాదు. జ్యోతి నిన్నే ఆవేశించినట్టుంది-" అన్నాను. నా వేపు ఆదోలా చూసింది. ఆ మెరుస్తున్న కళ్లల్లో భావాలు నేను చదవలేకపోయాను. ఆమె మెదడులో మంటలు చెలరేగుతున్నాయని మాత్రం గుర్తు పట్టాను. సరళని చూస్తుంటే భయంవేసింది. ఆశ్చర్యం వేసింది. ఆనందం వేసింది. ఒక్క క్షణం నేను కన్న కూతురేనా అనిపించింది. ఎన్నెన్ని సంగతులు చెబుతున్నది ! ఆ రాత్రి ఎప్పుడు నిద్రపోయామో తెలియదు.

జ్యోతి ఫోటో ఎన్‌లార్జ్ చేయించి ఫ్రేముకట్టించి తెచ్చింది సరళ. పెద్ద ఫోటో చూశాక లీలగా గుర్తొచ్చింది.

తండ్రి బట్టలు నేసేవాడట. వాళ్లు దేవాంగులు. ఇప్పుడు నేతబట్టలెవరు కట్టుకుంటున్నారు ? మగ్గాలు మూలపడ్డాయి. చుట్టలు చుట్టుకుని బ్రతుకుతున్నారట. ముగ్గురు మగపిల్లలూ ఒక్కగానొక్క ఆడపిల్ల ట !

మర్నాడు సాయంత్రం కృష్ణవేణి వచ్చింది, కారు మీద. కూడా పనిమనిషి, బొచ్చుకుక్క. కృష్ణవేణి తండ్రి కోటీశ్వరుడు. హోదాకోసం డిగ్రీ చేసింది. రెండు చేతులకీ నిండుగా గాజులూ మెడనిండా గొలుసులు, వళ్లంతా బంగారం ఖరీదయిన పట్టుచీర. మనిషిని మొదట్లో గుర్తు పట్టలేక పోయాను. బాగా లావెక్కింది. విజయనగరం రోజుల్నించీ తెలిసిన మనిషి. సరళకి ఫ్రెండ్.

సరళ జ్యోతి గురించి చెబుతుంటే మొహం చాలా అయిష్టంగా అదోకలా పెట్టింది కృష్ణవేణి "మనం అలాంటివాళ్లతో స్నేహం చెయ్యకూడదు." అన్నది. ఎక్కువ సేపు కూచోకుండానే వెళిపోయింది.

కాఫీ గ్లాసులు తీస్తూ "ఎవరమ్మా మహాతల్లి" అనడిగింది కామాక్షమ్మ. "విజయనగరంలో పుచ్చలవీధిలో ఆకాశపు అచ్చిరాజులేడూ, వాళ్లమ్మాయి. ఈ వూరి కోడలు." అని వివరించాను.

"అచ్చిరాజుగారి కూతురా ?" అని సాగదీసింది కామక్షమ్మ. గ్లాసులో కాఫీ గ్లాసులోనే వుంది. తాగనే లేదు.

"చూశావమ్మా జ్యోతికీ, కృష్ణవేణికీ ఎంతతేడావుందో ! కృష్ణవేణి నాకు స్నేహితురాలని చెప్పుకోవడం నాకు అవమానం. క్లాసుమేట్ కదా అని కర్టసీకి పలకరించి, ఓ సారి మా యింటికి రా అన్నాను - చాలా మారిపోయింది మనిషి" అన్నది సరళ.

సూర్యుడు వాయువేగమనోవేగాల్తో పరుగులు తీస్తున్నట్టున్నాడు, కాలం కరిగిపోతోంది. రెండు వారాలు ఇట్టే గడిచిపోయాయి. ఆగస్టు పదహారున కాలేజీలు తెరుస్తారని టెలిగ్రాం వచ్చింది. సరళ ప్రయాణసన్నాహాలు ప్రారంభించింది. ఆయన ఆగస్టు పద్నాలుగు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నానని ఫోన్ చేశారు. సరళ ఆగస్టు పదిహేను రాత్రి ట్రయిన్‌కి రిజర్వేషన్ చేయించుకుంది.

ఇంకా జ్యోతి ధ్యాస పోలేదు సరళకి. కామాక్షమ్మకి జ్యోతి సంగతి తెలుసట. కాని ఆ అమ్మాయి నెప్పుడూ చూడలేదట. కామాక్షమ్మ ఆడపడుచుగారి అత్తవారిల్లున్న వీధిలోనే జ్యోతివాళ్లిల్లట.

" చావెప్పుడూ తప్పదు. జ్యోతిమ్మ సావే సావంటే -" అని మెచ్చుకుంది కామాక్షమ్మ కూడాను.

★ ★ ★

సరళ కర్నూలు వెళ్లింది. వెళ్లే ముందు జ్యోతి వాళ్లింటికి వెళ్లి వచ్చింది.

ఒక రోజు సాయంత్రం సన్నగా పొడవుగా వున్న ఒకబ్బాయి వచ్చాడు. వయసు 24,25 ఏళ్లుండొచ్చు. చామన చాయగా వున్నాడు. చురుకయిన కళ్లు.

"నా పేరు భాస్కర్రావు, జ్యోతి మా చెల్లి -" అని పరిచయం చేసుకున్నాడు.

సరళ చిరునామా, హాస్టల్ ఫోన్ నెంబరు కావాలని తీసుకువెళ్లాడు.

తీరా అతను వెళ్లాక,చిరునామా ఎందుకిచ్చానా అనిపించింది. ఇవ్వకుండా వుండవలసింది. నెమ్మదిగా సరళని కూడా ఈ పోరాటంలోకి దింపుతాడేమోనని భయం వేసింది. ఇప్పుడెలా ? మనసు పరి పరివిధాల ఆలోచనల్లో ఊగిపోతుంది.

మా ఆయనతో చెప్పాను జరిగిన సంగతంతా. అదేం ఫరవాలేదు లెద్దూ అనేశారు. రాత్రి తొమ్మిది తరవాత వాళ్ల హాస్టలుకు ఫోన్ చేశాను. భాస్కర్రావు తనకి ఫోన్ చేశాడట. వివరాలు చెప్పకుండా

ఫోన్ పెట్టేసింది సరళ. మర్నాడు కామాక్షమ్మతో అంతా చెప్పి, ఆ భాస్కర్రావింటికి పంపించాను. అతను ఇంట్లో లేడట.

ఏమిటి ఆలోచిస్తున్నాను ? ఏం చేస్తున్నాను ? ఎందుకిలా ఆలోచిస్తున్నాను ? ఎందుకిలా ఆలోచిస్తున్నాను ? సరళ త్వరలో పెద్దడాక్టరవుతుంది. మంచి సంబధం చూసి పెళ్లిచేస్తాను. చక్కగా కాపరం చేసుకుంటుంది.

★ ★ ★

సరళ చదువు పూర్తిచేసుకొని ఇంటికి వచ్చేసింది. నాలుగు రోజులు ఎక్కడికీ వెళ్లలేదు. సరదాగా ఇంట్లో గడిపేసింది. ఆ రోజు నేను లేచేసరికే - పిల్లలు పడుకునే హాలులో లైటు వెలుగుతోంది. కిటికీ పక్క తను చదువుకొనే టేబిలు దగ్గర కూచుని దీక్షగా ఏదో పుస్తకం చదువుతోంది. ముఖం గాలా సీరియస్‌గా వుంది. ఎనిమిది. గంటల ప్రాంతంలో లేచి బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఇంత దీక్షగా చదువుతున్న పుస్తకం ఏమిటా అని చూశాను." ఎర్ర జెండాలు" గంగినేని వెంకటేశ్వరరావు కథలు, తిరగేసి చూస్తే నాకేం అర్ధం కాలేదు. తెలంగాణా, గెరిల్లా, పోరాటం, కమ్యూనిస్టులు, కామ్రేడ్ మొదలైన పదాలు కనిపించాయి. పుస్తకం మీద సి. భాస్కర్రావు అని పేరు కనిపించింది.

గబ గబా టిఫిన్ పూర్తిచేసి, మళ్లీ పుస్తకం పట్టుకుని కూచుంది. పగలంతా చదువతూనే వుంది. రాత్రి ఎప్పుడు పడుకుందో గమనించలేదు. ఉదయం కాస్త ఆలస్యంగా లేచి స్నానం టిఫిన్ ముగించుకుని, సైకిలు తీసుకుని బయలుదేరింది. "భాస్కర్రావు వాళ్లింటికి వెళ్తున్నానమ్మా" అని చెప్పింది. ఆ భాస్కర్రావుతో పద్దాకా నీకేం పనీ - అని అడుగుదామనుకున్నాను. భోజనం వేళకు ఇంటికి వచ్చింది. గబగబా భోజనం ముగించి మరో పుస్తకం పట్టుకుంది. ఆ పుస్తకం పేరు 'ప్రజల మనిషి' పక్కనే మరోపుస్తకం వుంది. దాని పేరు గంగు. రెండుపుస్తకాల రచయితా వట్టికోట ఆళ్వారు స్వామి. ఈ పేను నేనెన్నడూ వినివుండలేదు. ఇవేవీ సాధారణ నవలల్లాగ కనిపించలేదు. వీటినిండా పోరాటం కమ్యూనిజం వున్నట్టుంది.

పోస్ట్‌మన్ వచ్చి సరళ పేరున్న కవరు ఇచ్చివెళ్లాడు. పోస్టు ముద్రచూస్తే కర్నూలని వుంది. లేచిన తరవాత ఇచ్చాను. విప్పి చదువుకుని అడక్కుండా తనే చెప్పింది.

"మా కాలేజీలో ఒకమ్మాయి మీద పాతాలజీ ప్రొఫెసరు అత్యాచారం చేశాడని చెప్పాను చూడు. పాపం ఆ అమ్మాయికి మతిస్తిమితం తప్పిందట. ఆ ప్రొఫెసరు దొరికాడు,కేసు పెట్టారుగాని - తగిన సాక్ష్యాధారాలు లేక కేసు కొట్టేశారట. అంతే - ఈ రోజుల్లో దుర్మార్గానికి శిక్ష లేదు. చట్టం, కోర్టులు ఏమీ చెయ్యలేవు. ధనం, పలుకుబడి వుంటే చాలు ఎంతదుర్మార్గప్పని చేశయినా శిక్ష లేకుండా తప్పించుకోవచ్చు. ఆ సతీష్‌శర్మ చూడు. భార్య నైనా సాహ్నిని చంపేసి, పొయ్యిలో పడేసి కాల్చేసినా - ఏ శిక్షా లేదు వాడికి ! అంతే నమ్మా ! దెబ్బకి దెబ్బతీస్తే తప్ప లాభం లేదు. ఈ దేశానికి సాయుధపోరాటం మాత్రమే ఏకైక మార్గం -"

సరళ మాటలు వింటుంటే నాకు అయోమయంగా వుంది. ఎంతలో ఎంత మార్పు ! పూర్వం సరదాగా సినీమాలకూ షికార్లకూ వెళ్లేది. పత్రికల్లో సీరియల్ నవలలు చదివేది ! ఇప్పుడవన్నీ మానేసింది. కమ్యూనిస్టుగా మారిపోయిందా ? పేపర్లో ఎప్పుడూ ఎన్‌కౌంటర్ వార్తలు పట్టుబట్టి చదువుతూ వుంటుంది. ఒకరోజు వరంగల్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ వార్త చదివి చలించిపోయింది.

"మనుషుల్ని ఎలాచంపేస్తున్నారో చూడమ్మా" అని ఎంతో బాధపడింది.

కోటిరెడ్డి నుంచి ఉత్తరం వచ్చింది. అమెరికాలోనే సెటిలయిపోతాడట. డర్టీ ఇండియాకి రాబుద్ధి కావడం లేదట - అంతా చెప్పి లెట్ మిమ్ గో టు హెల్-" అన్నది.

సురేఖ డిగ్రీలో జాయినయింది. కల్పన టెన్త్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది. విక్రమ్ సెవెన్త్ పూర్తిచేసి ఎయిత్ క్లాసులో కొచ్చాడు.

రాత్రి ఆయన్తో - "సరళకి ఏదయినా సంబంధం చూస్తున్నారా. ఎన్నాళ్లు ఎరిగిన పిల్లని ఇంట్లో కూచోబెట్టుకుంటారు?" అన్నాను.

"సరళ ఏమంటోంది-"

"దాని మొహం - అదేమంటుంది. ఈ మధ్యకమ్యూనిస్టు పుస్తకాలు చదువుతుంది. జ్యోతి వాళ్లన్నయ్య భాస్కర్రావుతో స్నేహం చేస్తోంది"

"ఏ జ్యోతీ-"

"ఆ నక్సలైట్లలో కలిసి పోయిందని చెప్పానే ఆ జ్యోతి. ఆ అమ్మాయిని ఏజన్సీలో పోలీసు కాల్చిచంపేశారట మన సరళ క్లాస్ మేట్-"

"పోలీసులు కాల్చిచంపేశారా ?"

"మర్చిపోయారేమిటి ? మీ కప్పుడే చెప్పానుకదండీ-"

"అలాగా - అలాంటి వాళ్లతో సరళకు స్నేహం ఏమిటీ ?

మర్నాడు సరళని మందలించారు.

"నాకు బాగా తెలిసిన డాక్టరొకాయన వున్నాడు. అందాకా అతని క్లినిక్‌కి వెళ్తుండకూడదూ-" అన్నారు.

సరళ "కాపిటల్" సంపుటాలు తీసుకొచ్చింది. చూస్తే తెలుగులో వున్నాయి గాని నాకు ఏమీ బోధపడలేదు. బోలెడు మెడిసిన్ పుస్తకాలున్నాయి. అవన్నీ వదిలేసి ఇవి పట్టుకుందేమిటీ ?

★ ★ ★

ఆ రోజు నాకు వారం. పగలు పదిన్నరవుతుంది. ఆయన ఆఫీసుకు వెళ్లారు. పిల్లలు స్కూళ్లకి వెళ్లారు. నేను న్యూసు పేపరు చూస్తూ హాల్లో కూచున్నాను. సరళ బెడ్ రూంలో కూచుని ఏదో పుస్తకం చదువుకుంటున్నది. హాల్లో బెల్ మోగింది. తలుపు తీశాను. చిరునవ్వు నవ్వుతూ నుంచున్నాడు భాస్కర్రావు.

"లోపలికి రండి - కూచోండి - సరళా - సరళా " అంటూ నేను పక్కగదిలోకి వెళ్లాను. చేత్తో పుస్తకం పట్టుకునే సరళ ఇవతలికి వచ్చింది.

సరళ నవ్వుతూ పలకరించింది. ఇద్దరూ ముందు వరండాలో కూచుని మాట్లాడు కుంటున్నారు. నేను కామాక్షమ్మ చేత కాసిన్ని బిస్కట్లు, రెండు టీలు పంపించాను. చాలాసేపు మాట్లాడుకున్నారు. ఒంటిగంట కావస్తోంది. భోజనం చేసి వెళ్లామంటున్నది సరళ. ఫరవాలేదని లేచాడు భాస్కర్రావు.

భోజనంచేస్తూ సరళ చెప్పింది -

"1983 లో వరంగల్‌లో డాక్టర్ రామనాథం గారి పోలీసులు పబ్లిక్‌గా ఆయన క్లినిక్‌లోనే చంపారు. ఎందరెందరో పేద పోలీసుల పిల్లలకి ఆయన వైద్యం చేశాడు. పౌరహక్కులు సంఘంలో పనిచేస్తూ పోలీసుల అక్రమాల్నీ, పాలకవర్గాల కుట్రల్ని బడటపెట్టేరట. ముందురోజు ఖాజీపేట రైల్వేస్టేషన్‌లో నక్సలైట్లు ఒకపోలీసు ఆఫీసరుని చంపేశారు. నక్సలైట్లుకు మద్దతు ఇచ్చాడనీ, తన ఇంట్లో వాళ్లకి స్థావరం

ఏర్పాటుచేశాడనీ, ఆయుధాలు రహస్యంగా పంచిపెడుతున్నాడనీ - పోలీసులకు ఆయన పైన రకరకాల అనుమానాలు. నిష్కారణంగా ఉత్తముడైన ఒక డాక్టర్ని చంపారు"

"త్వరలోనే ఆయన పన్నెండవ వర్ధంతి జరగబోతున్నది. అనకాపల్లిలో పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రయత్నిస్తున్నాం. ఆ విషయాలు మాట్లాడ్డానికే వచ్చాడు. అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి తరపున వరవరరావుగారు, పౌరహక్కుల సంఘం తరపున బాలగోపాల్ గారు వక్తలుగా వస్తున్నారు. ఆరోజు రెండు పూటలా అధ్యయన తరగతులు, సాయంత్రం ఊరేంగింపు. మునిసిపల్ గ్రౌండ్సులో బహిరంగ సభ వుంటుంది. రాష్ట్రం నలుమూలల్నించి కార్యకర్తలు వస్తారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర నుంచి అధిక సంఖ్యలో రాబోతున్నారు."

డాక్టరు చదివి, చక్కగా వైద్యం చేసుకుని ఇంత సంపాదించుకుంటూ గుట్టుగా కాపరం చేసుకోవలసిన పిల్ల ఈ గొడవల్లో ఇరుక్కుంటున్నందుకు భయంగా వుంది.

ఆ రోజునుంచి సరళ చాలా బిజీగా తిరగడం ప్రారంభించింది. కరపత్రాలూ వాల్‌పోస్టర్లూ వచ్చాయి. రైల్వేస్టేషన్‌లోనూ, రైలు పెట్టెల మీదా, స్టేషన్ పరిసరాల్లోనూ అంటించమని ఒక కట్టవాలపోస్టర్లూ, ఇరవయి రూపాయలు రాజారావు కిచ్చిందట సరళ" అమ్మాయి గారు మా యింటికొచ్చారమ్మా" అని చెప్పింది కామాక్షమ్మ

వాల్ పోస్టర్లంటిస్తుంటే నలుగురు కుర్రాళ్లని అరెస్టు చేశారట పోలీసులు. జామీనిచ్చి విడిపించడానికి వెళ్లింది సరళ. విడిచి పెట్టలేదు. కార్యక్రమం ముగిశాక విడిచిపెడతారట. ఊరేగింపుకు పెర్మిషన్ ఇవ్వలేద. బాలగోపాల్, వరవరరావు స్థాయి మనుషులు పై ఆఫీసర్లతో సంప్రదింపులు జరిగిన మీదట - కొన్న పరిమితుల్లో పర్మిషన్ ఇచ్చారట.

ఆ రోజు నాకు బాగా గుర్తు. 1995 సెప్టెంబరు మూడో గురువారం. తెలతెలవారు తండగానే వెళిపోయింది. సరళ వచ్చేసరికి రాత్రి బాగా పొద్దుపోవచ్చునని చెప్పింది. ఒక వేళ రాకపోయినా ఆందోళన పడవద్దని చెప్పింది. నాకు ఏదో భయంగా వుంది. పిల్ల క్షేమంగా ఎప్పుడింటికి వస్తుందా అనివుంది. రాత్రి తొమ్మిదయ్యింది. పదయ్యింది. రాలేదు. ఫోన్ మోగింది. ఆయనే అందుకున్నారు. సరళనీ, మరొక ఆరుగుర్నీ అరెస్టు చేశారట. రేపుదయం కోర్టులో హాజరు పరుస్తారట.

దుఃఖం ఆపుకోలేకపోయాను. ఆయన గబ గబా బట్టలువేసుకుని పోలీసు స్టేషనుకు పరుగెత్తారు. ఒక గంట తరవాత తిరిగి వచ్చి పెదవి విరిచారు. ఆయన సరళ సంగతి విని చాలా కోపంగా వున్నారు. సరళ పరిస్థితి ఈ స్థాయికి వస్తుందని ఊహించుకోలేక పోయాం. ఆ రాత్రి కంటిమీద కునుకు పడితే వొట్టు. ఏ ఐదుగంటలకో రెప్పలంటుకుని వుంటాయి. ఎలాగో తెల్లవారింది.

కామాక్షమ్మ వస్తూనే " అమ్మాయిగారు అరెస్టయ్యారంట గదమ్మా" అన్నది.

"నీకెలా తెలుసు-"

"మా ఆయనకి రాత్రే తెలుసును - వదిలేస్తారంటండమ్మా - బాధపడకండి. గుండె ధైర్యం చేసుకోండి - అమ్మా మీకు చెబితే అబద్ధం నాకు నిజం - ఊరేగింపులో అమ్మాయిగార్ని చూశానండి. మన సరళమ్మ గారేనా అని ఆశ్చర్యపోయాననుకోండి - పులి పిల్లంటే నమ్మండి - చుట్టూ పోలీసులున్నారుగాని - ఆళ్లేం జేస్తారమ్మా - ఆళ్ల మొహం-"

"పోలీసులున్నారా -?"

"పోలీసులని మెల్లిగా అంటారేంటి. ఊరేగింపు ఎనకాతలే పెద్ద పోలీసు వాను"

సురేఖ పేపరు పట్టుకొచ్చింది "ఇదిగో నమ్మా అక్కఫోటో- అరెస్టయిందట" అక్క యింటికి రాలేదా ?"

కల్పన, విక్రమ్ కూడా వచ్చారు. "రాత్రి ఫోనొచ్చింది నాన్నా. మీరు పడుకున్నారని చెప్పలేదు. నాన్నగారు వెళ్లి తీసుకొచ్చేస్తారు-" అన్నాను విక్రమ్‌ని దగ్గరికి తీసుకుని. ఆయన గబ గబా పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఒక గంట తరవాత వచ్చారు. కూడా సరళని తీసుకొస్తారని అనుకున్నాను. ఒక్కరే వచ్చారు.

"సర్కిల్ ఛండ శాసనుడు. పై ఆఫీసర్లు విరచి పెట్టొదన్నారట. పది గంటలకి కోర్టుకి హాజరు పరుస్తారట. కోర్టు బెయిలు ఇవ్వొచ్చుట - బాలగోపాల్ వరకరరావు, వెంకటేశ్వరరావు, భాస్కర్రావు, సరళ, నిర్మల - మొత్తం ఆరుగుర్ని అరెస్టు చేశారు నిన్న రాత్రి తొమ్మిదికి -"

"అక్కకి చేతులకి సంకెళ్లు వేశారా -" అనడిగింది సులేఖ.

"లేదు. ఎవ్వరికీ సంకెళ్లు వెయ్యిలేదు. ఒక గదిలో మాత్రం కూచోబెట్టారు. రాత్రి తెల్లవార్లూ ఇంటరాగేషన్ పేర వేసిన ప్రశ్నలే వేసి విసిగించి నిద్రపోనివ్వలేదట. నేను వెళ్లి, టిఫిన్ కాఫీ పట్టుకెళ్లాను-"

"సరళ ఎలావుందండీ . ధైర్యంగా వుందా ?"

"విడిగా సరళనొకదాన్నే అరెస్టు చెయ్యలేదు గదా - ధైర్యంగానే వుంది." గబగబా భోజనం చేసి, ఆఫీసుకు సెలవుపెట్టి, ఆయన మళ్లీ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు.

నేను భోజనం దగ్గర కూచున్నాను గాని, నోటికి మెతుకు వెళ్లలేదు. కాలం బరువుగా, భయంగా, ఆందోళనగా గడుస్తున్నది. ఏ క్షణానికాక్షణమే సరళ వచ్చినట్టే భ్రమ - చివరికి మూడు దాటుతుండగా యింటికి వచ్చింది. నీరసంగా వున్నది. రాత్రంతా నిద్రలేదు. ఇంతవరకూ స్నానం లేదు, భోజనంలేదు. స్నానంచేసి, భోజనంచేసి, మంచం మీద వాలిపోయింది.

★ ★ ★

ఊరు వదిలిపెట్టి వెళ్లం, ఎప్పుడు పిలిస్తే అప్పుడు వచ్చికోర్టుకు లొంగిపోతాం అనే హామీలు తీసుకుని బెయిలిచ్చారట. ఆ రాత్రి చాలా పెద్దగొడవయింది. ఎన్నడూ లేనిది. ఆయన సరళ మీద చేయి చేసుకున్నరు. సరళ పిచ్చికోపంతో ఏవేవో మాట్లాడింది.

"ఒక్క క్షణం కూడ ఈ యింట్లో వుండను-" అని సూట్‌కేసు సర్దుకోవడం ప్రారంభించింది.

నాకు గుండెలు గుబ గుబలాడిపోయేయి. పిల్లలంతా చేరి అక్కా అక్కా అని ఏడుపు. సద్దుమణిగేసరికి, ఇళ్లకు వెళ్తున్న రెండో ఆట సినీమా జనం గోల వినిపించింది.

ఉదయం చాలా చాలా పొద్దెక్కేదాక లేవలేదు. తొమ్మిది గంటలకిగావును లేచి, బ్రష్ చేసి, తన గదిలో ఉత్తరాలు రాస్తూ కూచుంది. కాఫీ తాగలేదు. మాట్లాడలేదు. చాలా సీరియస్‌గా ముఖం పెట్టుకు కూచుంది. ఆయనతో చెప్పాను. ఆయనా పట్టుదల మనిషే, తన మానాన తను భోజనం చేసి ఆఫీసుకెళ్లారు. సురేఖ కాలేజీకి, పిల్లలు స్కూలుకీ వెళ్లారు

ఇద్దరం మిగిలాం ఇంట్లో. ఎంత పలకరించినా మాట్లాడలేదు. భోజనం చెయ్యలేదు. కామాక్షమ్మ కూడా చెప్పి చూసింది.

"నాన్నగారు కోపంతో ఏదో ఒక దెబ్బవేశారనుకోండి. దానికోసం అంత పట్టుదల పట్టకూడదు - అన్నీ తెలిసినవారు మీరే అలా చేస్తే - "

ఎర్రగా చూసింది కామాక్షమ్మకేసి.

సాయంత్రం ఆరుగంటలు కొడుతూండగా ఆఫీసునుంచి వాళ్ల నాన్నగారు వొచ్చారు. బట్టలు మార్చుకుని స్నానంచేసి వచ్చి విషయం తెలుసుకుని సరళ దగ్గరికి వెళ్లారు.

"సారీ బేబీ - కోపం తెప్పించావు. ఆవేశంతో చెయ్యి చేసుకున్నాను. దీనికోసం కాఫీ కూడ తాగకుండా ఇంత పట్టుదల పడతావా - నా మీద కోపం ఇంకా తగ్గలేదా -"

చాలా సేపటి వరకూ మాట్లాడలేదు.

"మీరు చెయ్యిచేసుకున్నందుకు కాదునాన్నా - నేను చేస్తున్నది తప్పన్నందుకు. నా సిద్ధాంతాన్ని ఘోరంగా అనుమానించినందుకు -

"చెప్పండి నాన్నా - కేవలం రాజ్యాంగం నిర్దేశించిన పౌరహక్కులు కావాలన్నందుకు, ప్రభుత్వం తనుచేసిన చట్టాన్ని తానే ఉల్లంఘిస్తుంటే, దానికి వ్యతిరేకంగా పోరాడినందుకు ఒక చిన్న పిల్లల డాక్టర్ని చంపారు. అతని క్లినిక్‌లోనే అతన్ని చంపారు. పట్టపగలు. ఇదినేరంకాదు. పోలీసుల ఈ పచ్చిదుర్మార్గాన్ని ఖండిస్తే - అది తప్పు. పోలీసులు గవర్నమెంటు గూండాలు నాన్నా. అసలు గవర్నమెంటు ఒక పెద్ద స్వార్థపరుల, దోపిడీకారుల గూండాల ముఠా. దానికి వ్యతిరేకంగా పోరాడ్డం నేరమా నాన్నా -? అమాయకుల్ని లాకప్పుల్లో వేసి చంపుతుంటే, మేధావుల్ని అక్రమంగా నిర్బంధిస్తుంటే చూస్తూ ఊరుకోమంటారా నాన్నా? - మీరు ఏ జాతీయనాయకుల ఫోటోలయితే మీ రూంలో పెట్టుకున్నావో వాళ్లవల్ల ఈ దేశం ఎంతో నష్టపోయింది నాన్నా !"

"బేబీ - నువ్వు ఎక్కువగా మాట్లాడుతున్నావు - ఆఫ్టరాల్ నువ్వు నాకళ్లముందు పుట్టావు - నీకు తెలిసింది చాలా తక్కువ-"

"ముందు పుట్టడం గొప్పకాదు నాన్నా - ముందుకు వెళ్లడం గొప్ప - నాతరం ఇవ్వాళ ముందుకు వెళ్తున్నది. ఇవ్వాళ చాలా త్యాగాలు చేస్తుంది నాన్నా - ఎప్పటికయినా ఈ దేశాన్ని ఈ దోపిడీ వ్యవస్థ నుంచి నాతరమే విముక్తి చేస్తుంది -"

"నువ్వు నమ్ముతున్న మార్క్సిజం - లెనినిజం రష్యాలో ఘోరంగా ఫెయిలయింది చూశావుగా -"

"అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్ర అదంతా. రష్యాలో మళ్లీ విప్లవ పోరాటం ప్రారంభమైంది. అక్కడ తప్పక మరో విప్లవం వస్తుంది. రివిజినిస్టులు, అమెరికన్ ఏజెంట్లు కుప్ప కూలిపోతారు. ఇది తప్పదు -"

వాళ్ల మాటలు ఆతరవాత నాకర్థం కాలేదు. కామాక్షమ్మా నేను ఒకరి మొహాలు ఒకళం చూసుకున్నాం -

"నీ బుర్ర ఎవరో చెడగొట్టారు సరళా - నువ్వింతిలా మారిపోతావని కలలో కూడా అనుకోలేదు - నువ్వు ఎంచుకున్నది ముళ్ళబాట -"

"అంతేకాదు చాలా సుదీర్ఘమైన బాట. నాకా సంగతి బాగా తెలుసు. ఇవ్వాళ అదే సరయిన బాట - కంఠంలో ప్రాణం వుండగా నేనా బాట విడిచిపెట్టను -"

ఈ వాదోపవాదాల మధ్యనే భోజనాలు పూర్తయ్యాయి.

"సరళమ్మగారు శానా బాగ చెప్పేరమ్మా " అన్నది కామాక్షమ్మ. నాకు అర్థంకాని మంచి దానికేం అర్థమయ్యిందో - !

"ఈ రకమైన తిరుగుళ్లు నేనెంతమాత్రం సహించను. చక్కగా ఎం.బి.బి.ఎస్. చదివించాను. హౌస్ సర్జన్సీకూడా చెయ్యి. మంచి సంబంధం చూసి పెళ్లి చేస్తాను. హాయిగా ప్రాక్టీసు పెట్టుకుని రెండుచేతులా సంపాదించుకుంటూ సుఖంగా కాపరం చేసుకో -" ఇవీ ఆయన మాటలు.

"నావి చెడుతిరుగుళ్లా నాన్నా - ? " అని సరళ బాధపడింది.

ఆ రాత్రి నేనూ చాలా సేపు బాధపడ్డాను.

★ ★ ★

తెల్లవారు జాము నాలుగున్నరయి ఉంటుంది. కీడు శంకిస్తూనే సరళ గదిలోకి వెళ్లాను. పక్క మీద లేదు. బాత్‌రూం వెతికాము, అన్ని గదులు వెతికాను. అన్ని గదుల్లో లైట్లు వేశాను. పెరడంతా వెతికాను. నా కేకలకి ఇరుగు పొరుగు వాళ్లందరూ లేచారు.

ఆయన టేబుల్ మీద ఉత్తరం కనిపించింది..

" అమ్మా నాన్నా - నేను ఈ ఇంటిలో ఇమడలేనని తేలిపోయింది. నేను నా దారి చూసుకుంటున్నాను. నన్ను కని, పెంచి, ఇంతదాన్ని చేసిన మీకు బాధ కలిగిస్తున్నందుకు నన్ను మన్నించండి. మీకు తలవంపులు తెచ్చే పని ఏదీ నేను చెయ్యడం లేదు. సురేఖా, కల్పనా విక్రమ్ - ! ఈ అక్కని క్షమించండి. బాగా చదువుకోండి. ఇక అమ్మకు నాన్నకు సంతోషాన్ని, తృప్తిని కలిగించవలసింది మీరే. నేను నమ్మిన సిద్ధాంతంలో విజయం సాధించడం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమే. మాది రేపటి తరం. ఓటమికి జడవం. నిరాశ దరికి రానివ్వం. విప్లవం మా చిరునామా. విముక్తి మా లక్ష్యం.

- సెలవు, స ర ళ "

"అమ్మగారూ అమ్మగారూ -" అంటున్నది కామాక్షమ్మ. ఎప్పుడొచ్చిందో నాపక్కనే నిలబడింది. నేను మొదలు నరికిన చెట్టులా కుప్పకూలిపోయాను. ఉదయిస్తున్న సూర్యకిరణాలు సూటిగా నా కళ్లలోకి పడి కళ్లు చీకట్లు కమ్మినట్టయింది.

"అమ్మా అమ్మా - " అని కల్పన నన్ను పట్టుకుని కుదపడం గుర్తుంది.

★ ★ ★

ఆ తరవాత మళ్లీ సరళ ఈ ఇంటి గడప తొక్కలేదు. తన సూట్‌కేస్‌లో కొద్దిగా బట్టలు పట్టుకెళ్లింది. ఒంటిమీద పెద్దగా బంగారం ఏమీలేదు, మెడలో ఒంటిపేట గొలుసు, చేతులకి జత గాజులు చెవులకు రింగులు తప్ప. గత పుట్టిన రోజుకు చేయించుకున్న ఉంగరం వదిలేసింది చాలా బట్టలు వదిలేసింది. తన సర్టిఫికేట్లు డైరీ పట్టుకెళ్లింది.

వెంటనే కామాక్షమ్మని బతిమాలి భాస్కర్రావు ఇంటికి పంపాను. భాస్కర్రావు ఇంటిలో లేడట. ఎక్కడికి వెళ్లాడో తెలియదట. ఆయన వచ్చి విషయం తెలుసుకుని కొంచెం సేపు చిందులేసి. చివరికి పోలీసు రిపోర్టు ఇచ్చి వచ్చారు. బోలెడు డబ్బులు తగలేసి పేపర్లన్నిటిలో వేయించారు. రేడియోలోను, టీవి. లోను చెప్పించారు. వారం గడిచింది. పదిరోజులు గడిచాయి ఫలితం కనబడలేదు. తల్లిగా నేననుభవిస్తున్న చిత్త క్షోభ అనుభవించినవాళ్లకు తప్ప ఇతరులకు ఎలా తెలుస్తుంది? రోజు గడవడం గండంగా వుంది. క్రమంగా సుమారు ఆరు నెలలు గడిచి ఉంటాయి. ఒకరోజు ఒక కార్డు వచ్చింది.

15-7-1996

అమ్మా -

నువ్వు నాకోసం ఎంత ఆందోళన పడుతున్నావో, నాన్నగారెంత బాధపడుతూండి ఉంటారో నేను అర్థం చేసుకోగలను. ఎం.బి.బి.ఎస్. పూర్తి చేశాను. ఒక నెలరోజుల క్రితం నేను భాస్కర్రావు పెళ్లి చేసుకున్నాం. మేమిప్పుడు వరంగల్‌లో ఉంటున్నాం. ఒక చిన్న బిల్డింగు అద్దెకు తీసుకుని క్లినిక్ పెట్టాను. భాస్కర్రావు పత్రికా విలేకరిగా పనిచేస్తున్నాడు. మా సంపాదన మాకు బాగానే సరిపోతుంది. నేను నా వృత్తిలో చాలా తృప్తినమభవిస్తున్నాను. అమ్మా ! నిన్ను నాన్నని ఒకసారి చూడాలని చాలా కోరికగా ఉన్నది. సురేఖ ఏంచేస్తుంది ? కల్పన, విక్రమ్ - ?

ఇదిగో నా చిరునామా ఇస్తున్నాను. నువ్వు నాన్నగారు ఒకసారి తప్పక వచ్చి చూసి వెళతారని ఆశిస్తాను. కామాక్షమ్మని అడిగానని చెప్పు.

- స ర ళ

డా॥ ఎస్. స ర ళ కు మా రి
15-11-470/, నయీం నగర్, విద్యారణ్య పురి,
హనుమకొండ, వరంగల్ - 506 009

కడుపులో దేవినట్టయింది. ఉత్తరం నాలుగైదు సార్లు చదువుకున్నాను. ఇంతలో కామాక్షమ్మ వచ్చింది. ఉత్తరం ఇచ్చాను. చదివి కళ్ల నీళ్లు పెట్టుకున్నది.

"పోన్లెండమ్మా. అమ్మాయిగారు కులాసాగా వున్నారు. డాక్టరయ్యారు. ఇక కావల్సిందేముంది? ఎడ్రస్ కూడా ఇచ్చారు కదండీ. ఎల్దాం సరళమ్మకాడికి. నేనూ వస్తాను మీకు సాయంగా ఆయమ్మని నాకూ చూడాలని ఉంది ".

ఐదుకావస్తుంది. పిల్లలు ముగ్గురూ ఇంటికి వచ్చారు. ఒకరి తరవాత ఒకరు ఉత్తరం చదివేరు.

"వరంగల్ అంటే ఎక్కడుందమ్మా, ఎంత దూరం ? " అవడిగాడు విక్రమ్. సురేఖ అట్లాస్ తెచ్చి, ఆంధ్రప్రదేశ్ పేజీ తిప్పి వరంగల్ ఎక్కడుందో చూపించింది. బయట పోర్టుకోలో బండి ఆగిన చప్పుడైంది. ఆయనకి ఎదురు వెళ్లి సరళ ఉత్తరం ఇచ్చాను. చదువుకుని చాలా సీరియస్‌గా మొహం పెట్టి, మాట్లాడకుండా బట్టలు మార్చుకుని, బాత్‌రూం కి వెళ్లారు. స్నానం చేసి లుంగీ కట్టుకుని హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చున్నారు. మళ్లీ మరోసారి ఉత్తరం చదివారు.

"ఒకసారి వెళ్లి వద్దామండీ - ఎలా వుందో ఏమో -"

"మనల్ని కాదని వెళ్లిందికదా - అదెలావుంటే మనకేం"

"అదేమిటండీ అలా అంటారు. అది అంతా కాని పనేం చేసిందండీ ? చక్కగా పెళ్లి చేసుకుంది. క్లినిక్ పెట్టి ప్రాక్టీసు చేసుకుంటుంది. మనల్ని చూడాలని వుందని కూడా రాసింది కదండి -"

"అంతగా చూడాలని వుంటే దాన్నే రమ్మని రాయి -"

నాకు కళ్లనీళ్ళు గిర్రున తిరిగేయి. ఎంత గొడవపడి అయినా సరే వెళ్లాలనే నిర్ణయించుకున్నా. మర్నాడు కామాక్షమ్మతో మాట్లాడాను.

"మా ఆయనతో మాట్లాడితే - ఏ రోజు కావాలంటే ఆ రోజుకు, ఏ ట్రయినుకు కావాలంటే ఆ ట్రయినుకు రిజర్వేషన్ టిక్కట్లు తీయిస్తాడమ్మా - రైల్వేవాళ్లంతా మనకు తెలిసినావాళ్లే కదమ్మా - నాకు మీరు టికెట్టు తీయక్కరలేదు." అన్నది.

అయన ఇవ్వకపోతే నా దగ్గిర ఆమాత్రం దారి ఖర్చులకు డబ్బులేకపోలేదు. మళ్లీ ఇంకోసారి అడిగేను. ఇద్దరం వెళ్లి వద్దాం పదండన్నాను. నేను రాను నువ్వు వెళితే వెళ్లు - అన్నారు. నేను వెళ్లి చూసి వస్తానని చెప్పేను. రేపు రాత్రి గోదావరి ట్రయినుకు టికెట్టు తెప్పించాను. బోగీ నెంబరు బెర్తు నెంబరుతో సహా వివరంగా టెలిగ్రాం కొట్టాను, సరళ పేర. ఊరు కొత్తగనక తప్పక ట్రయిను దగ్గిరికి రమ్మని కొంచెం ముందుగా అందేలాగ మూడు రోజుల క్రితమే ఉత్తరం కూడా రాశాను. ఎంతటెంతట చూద్దామా అని ఉంది సరళని. కామాక్షమ్మ కూడా బయలుదేరుతున్నది.

★ ★ ★

కొద్ది లేటయినా గోదావరి ట్రయిన్ తెల్లవారు జాము నాలుగు లోపునే వరంగల్ స్టేషనులో ఆగింది. ప్లాట్ ఫారం మీదికి ఇలా దిగామో లేదో అమ్మా అని పిలుస్తూ దగ్గిరకొచ్చింది సరళ. ఎన్నాళ్లయిందో దాన్ని చూసి. ఇద్దరికీ కళ్ల నీళ్లొచ్చాయి.

"సరళమ్మగారూ బాగున్నారామ్మా ?" అని కామాక్షమ్మ సరళ చెయ్యి పట్టుకుంది, ఆపేక్షగా.

"ఓహో నువ్వూ వచ్చావా ? బాగున్నావా ?" అని కామాక్షమ్మని పలకరించింది.

భాస్కర్రావు మా చేతిలో సూట్‌కేసు అందుకున్నాడు. అందరం ఆటోలో ఇంటికి బయలుదేరాం. తెల్లవారుజాము చల్లని గాలి హాయిగా ఒంటిని తాకింది. ఆటో చాలా సేపు నడిచింది. పెట్రోలు బంకు దాటి మలుపు తిరిగింది. ఇది నయీంనగరట. ఇంటికి వెళ్లాం. రెండు పెద్ద వాటాల ఇల్లు. తూర్పు వాటాలో ఒక నర్సు కుటుంబం ఉంటున్నది. కింద మా వాటాలో మూడు పెద్ద పెద్ద గదులు. మేడమీద క్లినిక్. ఇల్లు అన్నిటికి చక్కగా అమిరింది. ఇంటి ముందు పెద్ద రావిచెట్టుంది. పెరట్లో రెండు కొబ్బరి చెట్లున్నాయి. ఇంటి ముందు కుండీల్లో పూలమొక్కలున్నాయి. చుట్టు పక్కల పరిసరాలన్నీ చాలా ప్రశాంతంగా ఉన్నాయి. వాతావరణం కొంచెం వేడిగా వుంది.

విశాఖ జిల్లా చింతపల్లి ఏజెన్సీలో జ్యోతిని, మరికొందరిని ఎన్‌కౌంటర్ పేర చంపిన తాతారెడ్డిని ఒక నెల క్రితం ములుగులో విప్లవపార్టీవాళ్లు చంపేశారు. ఆ తరవాత జరిగిన గొడవల్లో భాస్కర్రావుని అరెస్టు చేసారుగాని కొంతగొడవ చేశాక మర్నాడు బైలు మీద విడుదల చేసారు. జ్యోతికి తమ్ముడు కావడమే అతన్ని అరెస్టు చెయ్యడానికి గల ఏకైక కారణం. కేసు పెట్టారు. కాని నిలబడదు - ఈ సంగతులన్నీ చెప్పుకుంటూ వచ్చింది.

సరళకు ఈ కొద్ది రోజుల్లోనే చాలా మందితో పరిచయం ఏర్పడింది. డాక్టర్ రామనాధంగారి కుటుంబంతో, నర్రా ప్రభాకరరెడ్డిగారి కుటుంబంతో పరిచయం అయ్యింది. భాస్కర్రావు పౌరహక్కుల సంఘంలోనూ, విప్లవ రచయితల సంఘంలోనూ సభ్యుడు. విలేకరి పని ఉండనే వుంది. ఇంకా పూర్తిగా తెల్లవారనయినా తెల్లవారనివ్వరు. ఎవరో ఒకరు వస్తారు. సరళకోసం పేషంట్లు కూడా అలా వస్తూనే ఉంటారు. ఉదయం ఎనిమిది నుంచి రాత్రి పదివరకు ఒక్కక్షణం తీరిక ఉండదు. భోజనానికి మేడ దిగడమే కష్టం. ఇద్దరు నర్సులు, ఒక కాంపౌండరు, ఒక పనిమనిషి. పని మనిషి యాదమ్మకి ఎవరూ

లేరు. ఆమె తండ్రి తెలంగాణా పోరాటం లో చచ్చిపోయాడట. ఆమె మొగుడుని కేవలం అనుమానం మీద తీసుకెళ్లి లాకప్‌లో పడేసి ఏవేవో రహస్యాలు చెప్పమని కొట్టి కొట్టి చంపేసారు ఇద్దరు బిడ్డలు పుట్టేరే కాని పురిటిలోనే పోయారు. భర్తని పోలీసులు చంపేసి ఆరేడేళ్లయిఉంటుంది. "మల్ల నాఒక్క కడుపుకి తిండి దొర్కదా బాంచన్. బుక్కడైతే సాలు. కష్టం జేస్కుని బత్కుత -" అన్నది తనకథంతా పూర్తిచేసి.

"మేం కొంతకాలం పాటు పిల్లలొద్దనుకుంటున్నాం -" అన్నది సరళ. భోజనంచేసి క్లినిక్‌కి వెళిపోయింది. మేం వెయ్యిస్తంభాల గుడి, పద్మాక్షి దేవాలయం, కాకతీయుల కోట శిధిలాలు - అన్నీ తిరిగి వచ్చాం. మాకు యాదమ్మ గైడు ! మమ్మల్ని అన్నీ తిప్పి తీసుకొచ్చిన ఆటో అబ్బాయి డబ్బులిస్తే పుచ్చుకోలేదు. "నా పెళ్లాం సచ్చేడిదే. బతికించినారు డాక్టరమ్మగారు. పైసలొద్దమ్మ -" అన్నాడు. పోన్లే కనీసం పెట్రోలు ఖర్చయినా తీసుకోమని యాభయిరూపాయలు చేతిలో పెట్టాను.

రాత్రి తొమ్మిది తరవాత ఇంటెదురుగా రోడ్డుమీద ఉన్న ఎస్.టి.డి.బూతుకువెళ్లి ఆయనతో మాట్లాడాను పిల్లలతో కూడా మాట్లాడాను.

"పోన్లే నీకు సంతోషంగా ఉన్నది కదా ! " అన్నారు. సరళ గురించి మరీ మరీ అడిగేరు. తనకి చెప్పకుండా వెళిపోయిందని కోపం తప్పిస్తే కూతురంటే ఆయనకి మాత్రం ప్రేమ లేదా ?

"మీరూ వస్తే బాగుండేది, సరళ చాలా సంతోషించేది. ఎల్లుండి తెల్లవారే సరికి అనకాపల్లిలో ఉంటాను" అని ఫోన్ పెట్టేశాను.

★ ★ ★

ఉదయం పత్రిక చూస్తే - ములుగు దగ్గిర ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదుల మృతి. జగిత్యాల మండల రెవెన్యూ కార్యాలయం పేల్చివేత - వార్తలు చదవగానే భయం వేసింది. మేం ఉంటున్న ఇంటికి కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషను దగ్గిరే. పోలీసులు తుపాకులు పట్టుకుని జీపులు మీద తెగ తిరుగుతున్నారు. గత మూడురోజులుగా పేపరులో ఇటువంటి వార్తలే చదువుతున్నాను. ఈ వార్తలేవీ విశాఖ జిల్లాకు రావు, మరీ ముఖ్యమైనవైతే తప్ప. చూడగా అగ్గిగుండంలో ఉన్నట్టుంది.

"మన ప్రాంతానికి వచ్చెయ్యండి సరళా. ఈ క్లినిక్ అక్కడే పెట్టుకోవచ్చు"

"విప్లవ పార్టీ మమ్మల్ని ఇక్కడ ఉండమన్నది. పార్టీ ఆదేశాల మేరకే ఇక్కడ ఉంటున్నాం. అప్పుడప్పుడు పోలీసు కాల్పుల్లో గాయపడినవారుకూడా వస్తుంటారు. చాలా రహస్యంగా రాత్రికి రాత్రే ట్రీట్ మెంట్ ఇచ్చి కావలసిన మందులవీ ఇచ్చి పంపిస్తుంటాను. "

" ఈ సంగతి పోలీసులకు గాని తెలిస్తే - "

"ఇంతవరకూ అలా జరగలేదు మేం అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాం."

ఆ రాత్రి ఒక డబ్భయ్యేళ్ల ముసలమ్మ వచ్చింది. ఆమె ముగ్గురు కొడుకుల్ని పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చేశారు. ఆమె కథ వింటే నా కడుపు తరుక్కు పోయింది. భాస్కర్రావుతో చాలా సేపు ఏమేమో మాట్లాడింది. భాస్కర్రావు ఆమెకు ధైర్యం చెప్పి, కొంత డబ్బిచ్చి పంపించేశాడు. ఆమె తూర్పు తెల్లవారకుండా చీకట్లోనే వెళిపోయింది. మర్నాడు నేను అనకాపల్లి వచ్చేశాను.

★ ★ ★

వచ్చిన మూడో రోజు నుంచి సరళ నుంచి ఉత్తరం వస్తున్నదేమోనని ఎదురు చూస్తునే ఉన్నాను. చూడగా చూడగా పదోరోజునాడు పెద్ద ఉత్తరం వచ్చింది. తెలంగాణా అగ్గిగుండంలా ఉంది......

"జగిత్యాల ఎం.ఆర్.ఓ. కార్యాలయం పేల్చివేత సంఘటన నీకు గుర్తుండే ఉంటుంది. ఈ సందర్భంగా ఇద్దరబ్బాయిలిని ఒకమ్మాయిని అరెస్టు చేశారు. అధికార పార్టీ ఎం.ఎల్.ఎ. ఫోన్ చేస్తే మర్నాడు ఇద్దరబ్బాయిలిని వదిలేశారు. ఆ అమ్మాయిని మాత్రం వదలలేదు. ఆ అమ్మాయిని పట్టుకుని నీ పేరు శాంతేనా ? అనడిగారట. కాదు నా పేరు కాంతి అని ఎన్ని సార్లు చెప్పినా వినరు. పోలీసులు ఆమెను నువ్వే శాంతి అని ఒప్పుకోమని నానా హింసలూ పెట్టేరు. ఆమె పేరు కాంతి అని ఆమె తల్లి దండ్రులు, స్నేహితులు, ఇరుగు పొరుగులు, బంధువులు ఎందరు చెప్పినా వినలేదట. ఆమె దగ్గిర - మహిళామార్గం, అరుణ తార, స్వేచ్ఛ పత్రికా - కొన్ని కరపత్రాలు దొరికాయట. "ఇవెందుకు చదువుతావు చక్కగా జ్యోతిచిత్ర, సితార, స్వాతి లాంటి పత్రికలు చదువుకోవచ్చుకదా" అన్నాడట డి.ఎస్.పి. "నాకవి ఇష్టం ఉండదు. నేను ఏ పత్రికలు చదవాలో కూడ మీరే నిర్ణయిస్తారా ?" అని అడిగిందని గూబ పగలు గొట్టాడట. ఏవేవో గొడవలు చెప్పి ఎవరెవరి పేర్లో చెప్పి వాళ్లు నాకు తెలుసని ఒప్పుకోమని ఆమెని విపరీతంగా హింసించారట. మర్నాడు మాకు తెలిసి పెద్ద ఎత్తున గొడవ చేశాం. ఆ అమ్మాయికి నిజానికి ఏ విప్లవ పార్టీతోనూ సంబంధాలు లేవు. డిగ్రీ ఫస్టియర్ చదువుతుంది. ఆమెపై బనాయించిన కేసులన్ని కొట్టేసి బేషరతుగా విడుదల చేయాలని మేం వారం రోజుల పాటు ఉద్యమం చేశాం. హోం మంత్రినీ, ముఖ్య మంత్రినీ కలిశాం. చివరికి విడిచిపెట్టారు. ఆమె మీద తప్పుడు కేసులు ఉపసంహరించుకోలేదు. అవి నిలబడవనుకో. ఐనా కోర్టు చుట్టూ తిరగాలి కదా. ఆ అమ్మాయి ఒంటినిండా పాపం చాలా గాయాలు. ప్రస్తుతం నా క్లినిక్ లోనే ఉన్నది. చిన్న పిల్ల - ఎంత ధైర్యంగా నిలబడిందో -"

ఆ ఉత్తరం చదువుతుంటే కళ్ల నీళ్లాగలేదు. నేను వెంటనే ఉత్తరం రాశాను.

ఒక రోజు అర్ధాంతరంగా భాస్కర్రావొచ్చాడు. శ్రీకాకుళం నుంచి వస్తున్నానన్నాడు. రాత్రి పదకొండు దాటి ఉంటుంది. చాలా నీరసంగా గెడ్డం మాసి అలసిపోయినట్టు కనపడుతున్నాడు. నా మనసు కీడు శంకించింది.

ఒక వారం క్రితం శ్రీకాకుళం జిల్లాలో ఒకే ఎన్‌కౌంటర్ లో పోలీసులు ముగ్గురు విప్లవ పార్టీ కార్యకర్తల్ని చంపేశారట. ఆ వివరాలు మరింత స్పష్టంగా తెలుసుకోడానికి వచ్చాడట. శ్రీకాకుళం జిల్లాలో ఉద్యమం పునర్నిర్మాణమౌతున్న పరిస్థితులు, ఈ సంఘటన వలన జరిగిన నష్టం ఇంకేవేవో సంగతులు చెప్పాడు. నాకేమీ అర్థం కాలేదు.

"పోలీసులు అంత ఘోరంగా కార్యకర్తల్ని పట్టుకు చంపేస్తున్నప్పుడు పార్టీ తన పద్ధతులు మార్చుకోవచ్చుకదా. యువకులు నిష్కారణంగా చచ్చిపోవడం నాకు చాలా బాధగా ఉంది" అన్నాను. అతను ఏవేవో చాలా సంగతులు చెప్పాడు. మాట్లాడుతునే నిద్రపోయాడు. భాస్కర్రావు వంటి వాళ్లు ఏ స్వార్థంతో పనిచేస్తున్నారు ? అసలు విప్లవ పార్టీ ఏం ఆలోచిస్తున్నది ? కార్యకర్తలు ఘోరంగా మరణిస్తున్నారు. విప్లవం ఎప్పటికైనా గెలిచేనా ? నా మధ్య తరగతి మట్టి బుర్రలో రకరకాల ఆలోచన్లు పెనవేసుకున్నాయి. ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు.

నాలుగవుతున్నదనుకుంటాను. భాస్కర్రావు లేచాడు. గబ గబా బయలు దేరుతున్నాడు. మాణిక్యం చేత తాను వచ్చినట్టు క్షేమంగా ఉన్నట్టు, తమ ఇంటికి కబురు చేయమని చెప్పేడు. మండే కళ్లతో సాగనంపాను. ఇంటికి చేరగానే ఫోన్ చెయ్యమని చెప్పేను. ఉదయం ఆయన, "భాస్కర్రావు

వచ్చాడా?" అని అడిగారు. ఏదో పనిమీద విశాఖ పట్నం వచ్చాడు. రైలు తప్పింది. ఇటు వచ్చి కనిపించి మళ్లీ వెంటనే వెళిపోయాడని నేను సర్ది చెప్పేను. ఉదయం తేస్తూనే మాణిక్యం తో సంగతులన్నీ చెప్పి భాస్కర్రావింటికి కబురు చెప్పి రమ్మన్నాను.

అర్ధాంతరంగా ఎన్నికలొచ్చాయి. కేంద్రంలో ప్రభుత్వం పడిపోయింది. కాంగ్రెస్ యునైటెడ్ ఫ్రంట్‌కు మద్దతు ఉపసంహరించుకుంది. రెండు కమ్యూనిస్టు పార్టీలు పూర్తిగా దిగజారిపోయియి. వాటిని కమ్యూనిస్టు పార్టీలని పిలవడం కూడా అనవసరం.

ఒకసారి చూడాలని వుంది రమ్మని సరళకి ఫోన్ చేశాను. వచ్చే శనివారం సాయంత్రం బయల్దేరి ఆదివారం వుదయానికి అనకాపల్లి వస్తున్నామని నిన్న ఫోన్ చేసింది. నా మనసు చాలా సంతోషంతో నిండిపోయింది. ఈసారి ఏ కళ నున్నారో ఆయన కూడా చాలా సంతోషించారు.

శనివారం సాయంత్రం మాణిక్యం "అమ్మా ! ఈ పాటికి సరళమ్మ అక్కడ బండెక్కి వుంటాదామ్మా ?" అనడిగింది.

"బహుశా రాత్రి ఎనిమిది గంటలకి ఎక్కుతారు. తెల్లవారేసరికి ఇక్కడుంటారు" అన్నాను.

"ఆరికంటే ముందే నేనిక్కడుండనూ -" అనుకుంటూ వెళ్లింది.

తెల్లవారేసరికి వస్తూ -" బండి రైట్ టైమ్ నంటండి. మరో పావుగంటలో వచ్చేస్తారు సరళమ్మగారు -" అన్నది మాణిక్యం.

చకచకలాడుతూ పనులు చేస్తున్నది. ఇంటిముందు ఆటో ఆగింది. సరళ భాస్కర్రావూ దిగారు.

సరళ వస్తూనే తండ్రి దగ్గరికి వెళ్లింది. ఆయన ఇంత మొహం చేసుకుని కూతుర్ని పలకరించారు. ఇల్లంతా సందడి సందడి.

మాణిక్యం నా చెవిలోకి వచ్చి గుసగుసలాడింది. " అమ్మగారూ - సరళమ్మ నీళ్లోసుకున్నట్టున్నారు -"

స్నానం చేసి వచ్చి, టిఫిన్ టేబుల్ దగ్గరి కూచుంటూ తనకు నాలుగో నెలనీ, ఒకే ఒక ఆడపిల్లని గాని మగ పిల్లనిగాని కని ఇక ఆపేస్తామనీ చెప్పింది.

"సరే లెండమ్మా. ముందు బిడ్డని పుట్టనియ్యండి. మిగత సంగతులన్నీ ఆ యెనక ఆలోచిద్దాం -" అంది మాణిక్యం.

టిఫిన్లు చేసి, ఇద్దరూ కలిసి భాస్కర్రావూ వాళ్లింటికి వెళ్లారు. మాణిక్యం రకరకాల వంటలు చేయించింది నాచేత. మూడు దాటుతుండగా ఇద్దరూ వచ్చారు. సీతకాలపు పొద్దు. సంక్రాంతి పండుగ ఇంకా నెలరోజులు కూడా లేదు.

ఆ రాత్రి సరళ చిన్న పిల్లలా కబుర్లు చెబుతూ నాదగ్గరే కూర్చుంది. వరంగల్ విశేషాలన్నీ చెప్పింది. నా కూతురు ఎంత గొప్ప బతుకు బతుకుతున్నదీ అనిపించింది. ఎన్నాళ్లు బతికితేనేం ప్రజల కోసం బ్రతకడం గొప్ప. ఈ జీవితం అందరికీ సరళరేఖ కాదు. నూటికి డబ్బయిమందికి అది ముళ్లబాట. ఎన్ని పోరాటాలు, ఎన్ని త్యాగాలు, ఎన్ని ఉద్యమాలు చేసి అయినాసరే జీవితాన్ని సరళం, సుఖమయం చేయడం కోసం శ్రమిస్తున్న వారు నిజమైన ప్రజాస్వామ్యవాదులు, దేశభక్తులు. ఇదీ సరళ అభిప్రాయం.

మర్నాడు సరళకోసం ప్రత్యేకంగా మినప గారెలు చేసి బెల్లం పాకం పట్టాను. దానికి బెల్లంతో చేసిన పిండి వంటలంటే ఎంతో ఇష్టం. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఫోన్ మోగింది. అది భాస్కర్రావు కోసం. మాట్లాడి వచ్చి "సరళా మనం ఈ రాత్రికే కోణార్కలో వరంగల్ బయలుదేరాలి" అన్నాడు.

ఉన్నట్టుండి ఒక పెద్ద టెలిగ్రాం, కొరియర్ సర్వీసులో ఒక కరపత్రాల కట్ట వచ్చాయి. ఇటీవల బీహారులో జరిగిన రణబీర్ సేన మారణ కాండ గురించి ఎ.పి.సి.ఎల్.సి. తయారు చేసి కరపత్రాల కట్ట అది. కొన్ని కరపత్రాలు ఇంగ్లీషులో ఉన్నాయి.

బీహార్‌లో రణబీర్ సేన అనేది భూస్వాములు పోషిస్తున్న గూండాల సైన్యం వాళ్లు డిసెంబరు 1 సోమవారం రాత్రి బీహార్‌లో, జహనాబాద్ జిల్లా లో లక్ష్మణపూర్ బాత్ అనే గ్రామంలో రణబీర్ సేన గూండాలు 61 మందిని నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోశారు. వారిలో 19 మంది పురుషులు, 27 మంది స్త్రీలు, 15 మంది చంటి పిల్లలు. వారిలో ఏడాది చంటిపిల్లడు కూడా ఉన్నాడు. ఒక తల్లి తన ఏడాదిన్నర బిడ్డణ్ణి ఎవరికీ కనపడకుండా గబగబా మంచం కిందకి విసిరేసిందట. వాడు ఆ గొడవలో పాకుకుంటూ పక్కగదిలోకి వెళిపోయాడు. చివరికి బ్రతికాడు. వాణ్ణి అమ్మేదీ - అని అడిగితే ఇంకా మంచం వేపు చూపిస్తున్నాడట. ఒక పిల్లడికి పదేళ్లు. బాగా చదువుతాడు. స్కూల్‌లో అన్ని ఫస్ట్ మార్కులొస్తాయి. గూండాలు వాణ్ణీ వదలలేదు. రాత్రి 8 నుంచి 10 వరకు ఆ గ్రామంలో అమాయక రైతుల రక్తం ప్రవహించింది..........

కర పత్రాలు చదివి నాకు నోట మాటరాలేదు. ఒక ప్రభుత్వం - అది ఎంత బూర్జువా ప్రభుత్వమే అయినా - అసలు ఉన్నట్టా లేనట్టా ?అది ఊరా అడివా ? మనం మనుషులమా,మృగాలమా ? కనీసం క్రూర మృగాలు కూడా ఇంత విచక్షణారహితమైన మారణకాండ సృష్టించవు.........

ఆ రాత్రి కోణార్క్‌లో వరంగల్ బయలు దేరారు. వెంటనే ఢిల్లీ వెళతారట. రాష్ట్రపతిని, బీహార్ గవర్నర్ ని కలుస్తారట. జీవించటం గొప్పకాదు. నాకూతురు సరళలా జీవించటం గొప్ప . ప్రజలకోసం ఉద్యమిస్తూ జీవించటం గొప్ప. ఉద్యమం సరళరేఖ కాకపోవచ్చు. కాని సరళరేఖలా అందరి జీవితాలూ ఉండవుకదా. నాకు వాళ్లిద్దరివెంటా ఢిల్లీ వెళ్లాలనిపించింది. ఎలా వెళ్లగలను? కాని నా మనసంతా ఈ ఆలోచనలతోనే నిండిపోయింది. తెలివిడి క్రమంగా చైతన్యానికి, ప్రత్యామ్నాయ చర్యకి దారితీస్తుంది నాలో తెలివిడి పెరుగుతున్న కొద్దీ నేను సహితం ప్రజల కోసం ఉద్యమించాలనీ, ఈ పంజరాన్ని చేదించుకుని బయటపడాలనీ అనిపిస్తున్నది. బయట పడతాను. పడాలి కూడా.

*రచన : 7-10-1997 - 30-12-1997 మధ్యకాలం*